ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
బుధవారం 22 అక్టోబరు 2025





దీపావళి వెలుగులు

తిరుపతి నగరంలో..



శాస్త్రోక్తంగా కేదార గౌరీ వ్రతం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కేదారగౌరీదేవి వ్రతాన్ని మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీకృష్ణ దేవరాయమండపంలో పార్వతీదేవిని కొలువు దీర్చి వ్రతాన్ని నిర్వహించారు. మహిళా భక్తులు వ్రతంలో పాల్గొని, నోముదారాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ఏఈవో లోకేష్, సూపరింటెండెంట్ నాగభూషణం, ప్రధాన అర్చకుడు సంబంధం గురుకుల్ తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



సోమ, మంగళవారాల్లో ఒకవైపు వర్షం పడుతున్నా.. మరోవైపు మిరుమిట్లుగొలిపేలా బాణసంచా పేల్చారు. ఉత్సాహంగా దీపావళి పండుగ జరుపుకొన్నారు. కాకుంటే, టపాసుల వ్యాపారం మాత్రం తగ్గింది. ఇళ్ల ముందు దీపాలు వెలిగించారు.

జోరు వాన

- పది మండలాల్లో భారీగా.. మరికొన్ని చోట్ల మోస్తరు
- వడమాలపేటలో చెరువుకు గండి
- కోటలో తెగిపడిన విద్యుత్ తీగలు
- నేడు విద్యాసంస్థలకు సెలవు

ఈశాన్య రుతుపవనాలు.. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా మంగళవారం జిల్లావ్యాప్తంగా వర్షాలు కురిశాయి. పది మండలాల్లో భారీగా.. మరో 14మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. జిల్లావ్యాప్తంగా సగటున 32.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షంనేపథ్యంలో బుధవారం ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- వడమాలపేట మండలం లక్ష్మమ్మ కండ్రిగ పంచాయతీ ఎస్సీ కాలనీ కొత్త చెరువుకు సోమవారం మధ్యాహ్నం గండి పడింది. మంగళవారం సాయంత్రానికి గండి పూడ్చారు.
- బాలాయపల్లి మండలం జయంపు చెరువు కలుజు వద్ద కట్ట కోతకు గురైంది.
- భారీ వర్షం, ఈదురుగాలులతో కోటలోని ఆరాధ్య థియేటర్ రోడ్డులో మంగళవారం మధ్యాహ్నం విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. అదృష్టవశాత్తూ ఆ సమయంలో జనం లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.
- వాకాడు, కోట మండలాల పరిధిలో అలలు ఎగిసిపడి సముద్రం అల్లకల్లోలంగా మారింది. దీంతో సోమవారం మధ్యాహ్నం నుంచే మత్స్యకారులు చేపల వేట నిలిపివేశారు.
- పెళ్లకూరు మండలం జీలపాటూరు వద్ద ఎల్డి ఫైర్లలో వర్షపు నీరు చేరింది.
- శ్రీకాళహస్తి, నాయుడుపేట వద్ద స్వర్ణముఖి నదిలోకి నీరు చేరుతోంది.
- తిరుపతిలో సోమవారం మోస్తరు వాన పడగా మంగళవారం జడివాన పట్టుకుంది. రోజంతా ఏదో ఒకస్థాయిలో వర్షం పడుతూనే వుంది.



బుచ్చినాయుడు కండ్రిగ మండలం ఆలత్తూరు వద్ద పందికాలువలో నీటి ఉధృతితో రాకపోకలు ఆపేసిన అధికారులు







వడమాలపేట మండలం లక్ష్మమ్మ కండ్రిగ కొత్తచెరువుకు సోమవారం పడిన గండి

సూళ్లూరుపేటలోని షార్ వై జంక్షన్ సమీపంలో నివాసాల నడుమ వర్షపునీరు

ఏర్పేడు మండలం గుడిమల్లం నుంచి భక్తులను సీతకాలువ వద్ద వద్ద ట్రాక్టరులో దాటిస్తున్న ఆలయ నిర్వాహకులు

0877-2236007కు ఫోను చేయండి

వర్షంతో ఏవైనా సమస్యలా? ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడ్డాయా? అయితే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌కు 0877-2236007 ఫోను చేసి సమాచారం అందించాలి. మండలస్థాయిల్లోనూ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు.



వెంకటగిరి వద్ద కౌవల్యానది ప్రవాహం

వర్షపాతం ఇలా..

జిల్లాలో మంగళవారం నమోదైన వర్షపాతంలో అత్యధికంగా వాకాడులో 104.6మి.మీ. నమోదైంది. సూళ్ళూరుపేట 74.4 మి.మీ, ఓజిలి 62.8, కోట 56.6 , దొరవారిసత్రం 53.8, చిట్టమూరు 53.6, తడ 48.6, తిరుపతి అర్బన్ 43.6, బాలాయపల్లి 43.4, తిరుపతి రూరల్ 41.6, బుచ్చినాయుడుకండ్రిగ 39.4, వడమాలపేట 38.6, వరదయ్యపాళెం 38.2, శ్రీకాళహస్తి 36.8, తొట్టంబేడు 33.4, ఏర్పేడు 33.2, రేణిగుంట 32.4 మి.మీ. చొప్పున వర్షం పడింది. డక్కిలి, పిచ్చాటూరు, చిన్నగొట్టిగల్లు, నారాయణవనం, ఎర్రావారిపాళెం, నాగలాపురం మండలాలు మినహా మిగిలిన చోట్ల ఒక మోస్తరు వర్షం కురిసింది.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి



కోటలో తెగిపడిన కరెంటు తీగలు

అధికారులూ.. అప్రమత్తంగా ఉండండి

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమావేశమయ్యారు. పోలీసుశాఖ వారు లోతట్టు ప్రాంతాల్లోని చెరువులు, కాజ్‌వేల వద్ద బారికేడ్లను ఏర్పాటు చేసి రెవెన్యూ సిబ్బందితో కలిసి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అంగన్వాడీ, ప్రైమరీ పాఠశాలలకు సంబంధించి శిథిలావస్థ.. పెచ్చులూడుతున్న భవనాలను గుర్తించి అనువైన వాటిల్లోకి మార్చాలన్నారు. మెరుగైన పారిశుధ్యంపై స్థానిక సంస్థల అధికారులు దృష్టి పెట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు మెడికల్ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. డ్రైనేజీలు, కాలువలు, చెరువుగట్లు, వంతెనలు, లోతట్టు ప్రాంతాల వద్ద ప్రమాదాలు సంభవించకుండా చూడాలన్నారు. తిరుపతి కమిషనర్, ఇన్‌ఛార్జి జేసీ మౌర్య, డీఆర్వో నరసింహులు, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, డీపీవో సుశీలాదేవి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.





శేషాచల కొండల్లో నుంచి మాల్వాడి గుండం.. కపిలతీర్థం జలపాతాల ప్రవాహం



సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానంలో నీళ్లు చేరడంతో బోసిపోయిన టపాకాయల దుకాణాలు

టపాసుల వ్యాపారానికి వాన దెబ్బ

దీపావళి సందర్భంగా జిల్లాలో టపాసుల వ్యాపారానికి వాన దెబ్బ పడింది. వర్షం పడుతుండటంతో కొనుగోలుదారులు పెద్దగా రాలేదు. తెరపిచ్చినప్పుడు మాత్రం కొందరు వెళ్లి కొనుగోలు చేశారు. ఆయా మైదానాల వద్ద ఏర్పాటు చేసిన టపాసుల అంగళ్లు కళ తతప్పాయి.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

స్వర్ణమ్మకు జలకళ

స్వర్ణముఖి నది జలకళ సంతరించుకుంది. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం కొత్త నీరుచేరింది. కార్తీక మాసం తొలిరోజున పవిత్ర నదిలో జలకళ ఆరంభమైంది.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



జిల్లాకు మరో డయాలసిస్ కేంద్రం

తిరుపతి(వైద్యం), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఉపశమనం కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం మరో డయాలసిస్ కేంద్ర ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. వెంకటగిరిలో ఏర్పాటు కానున్న ఈ కేంద్రంలో రూ.75 లక్షలతో మూడు రక్తశుద్ధి పరికరాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.ప్రతిరోజూ మూడు సెషన్లలో 15 మందికి డయాలసిస్ చేయొచ్చు. ఈ కేంద్రం ఏర్పాటు వల్ల ఆప్రాంత బాధితులకు పెద్ద ఉపశమనమనే చెప్పాలి. డయాలసిస్ కోసం దూర ప్రయాణం తగ్గనుంది.

నకిలీ టీటీఈ అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న నకిలీ టీటీఈని రైల్వే పోలీసులు పట్టుకున్నారు. జీఆర్‌పీఎఫ్ సీఐ ఆశీర్వాదం తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం కన్నదాసన్ నగర్‌కు చెందిన జితేంద్ర షా తిరుపతిలో టీటీఈగా అవతారం ఎత్తాడు. రైళ్లలో దిగుతున్న ప్రయాణికులను టార్గెట్‌గా చేసుకుని వసూళ్లకు పాల్పడుతున్నాడు. ఇతడిపై రెండు రోజుల క్రితం అందిన ఫిర్యాదుతో నిఘా పెట్టారు. ఈ క్రమంలో గేటు నెంబరు 3 వద్ద ప్రయాణికుల వాగ్వాదంతో పోలీసులు వెళ్లి విచారించారు. తన వద్ద సరైన టికెట్ లేకపోవడంతో రూ.వెయ్యి జరిమానా వేశారని, తన వద్ద రూ.500 తీసుకుని రసీదు ఇవ్వలేదని ఓ ప్రయాణికుడు చెప్పారు. మిగతా రూ.500 కోసం బెదిరిస్తున్నాడని తెలిపారు. నగదు వసూలు చేసిన వ్యక్తిని పోలీసులు పోలీసులు విచారించగా తాను టికెట్ కలెక్టర్‌నని చెప్పాడు. అతడి వద్ద గుర్తింపు కార్డు లేకపోవడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. రైల్వే జీఆర్‌పీఎఫ్ ఎస్ఐ రత్నమాల కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

◆ పోలీసు అమర వీరులారా

మీ త్యాగాలు మరువలేం



అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని కలెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా మంగళవారం తిరుపతిలోని పోలీసు పరేడ్ మైదానంలో అమరవీరుల స్థూపం వద్ద ఎస్పీ సుబ్బరాయుడితో కలిసి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మన భద్రతకు పోలీసు సిబ్బంది రక్షణ కవచం లాంటివారని కొనియాడారు. జిల్లాలో ఇప్పటి వరకు విధి నిర్వహణలో అసువులు బాసిన 25 మంది పోలీసు సిబ్బంది త్యాగాలు చిరస్మరణీయమని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. వారి త్యాగం వ్యర్థం కాదని, వారి కుటుంబాలకు పోలీసు శాఖ అండగా ఉంటుందన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు పోలీసు శాఖ తరపున కలెక్టర్, ఎస్పీ శాలువా కప్పి, జ్ఞాపిక ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు, ఇంటెలిజెన్సు ఏఎస్పీ రాయుడు, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.









షికారీలకు చీరల పంపిణీ

తిరుచానూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) స్థానిక గ్రామ పంచాయతీలోని షికారీకాలనీని పీ-4 పథకంలో భాగంగా తాను దత్తత తీసుకున్నట్లు రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల తెలిపారు. ఈక్రమంలో కాలనీవాసులకు మంగళవారం ఆయన చీరలు, స్వీట్లు పంపిణీ చేశారు.

ఆగమోక్తంగా కేదారగౌరీ వ్రతం


కేదారగౌరీ పూజలో భక్తులు


తాతయ్యగుంట గంగమ్మ

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మంగళవారం కేదారగౌరీ వ్రతం పూజలు నిర్వహించారు. ఆలయ ముఖ మండపం వద్ద అమ్మవారి ఉత్సవమూర్తికి ప్రత్యేక అభిషేకాల అనంతరం సుందరంగా అలంకరించి కర్పూర హారతులిచ్చారు. కలశ స్థాపన చేసి గణపతిపూజ, పుణ్యాహవచనం నిర్వహించి కేదారగౌరీ వ్రత పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు. ఈ వ్రత విశిష్టతను పండితులు రామకృష్ణశర్మ భక్తులకు వివరించారు. ఆలయ పాలక మండలి చైర్మన్ నైనారు మహేష్ యాదవ్, ఈవో జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం: రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వరాలయంలో సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు కేదారీ గౌరీ వ్రతం జరిగింది. **తిరుపతి రూరల్:** తుమ్మలగుంట ఎల్ఎస్‌నగర్‌లోని శక్తి చాముండేశ్వరీ ఆలయంలో కేదారి గౌరీవ్రతాన్ని వేడుకగా నిర్వహించారు. తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు. **భాకరాపేట:** భాకరాపేట ముత్యాలమ్మ ఆలయం, కన్యకా పరమేశ్వరి ఆలయం, చిన్నగొట్టిగల్లులోని శివాలయం, కన్యకా పరమేశ్వరి ఆలయాలలో మహిళలు నోములు నోచుకున్నారు.

చంద్రగిరి: పట్టణంలోని మూల స్థాన ఎల్లమ్మ, కన్యకాపరమేశ్వరి, మల్లేశ్వరాలయం, సాయిబాబా మందిరం, అగస్త్యేశ్వరాలయాల్లో కేదారి గౌరీదేవి పూజలు నిర్వహించారు. మూల స్థాన ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో మమత, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు


జస్టిస్ మానవేంద్రరాయ్

తిరుచానూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ మానవేంద్రరాయ్ మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఢిల్లీ రాష్ట్ర హోంమంత్రి ఆశీష్‌సుద్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం


మృతి చెందిన పార్థసారథి

తిరుచానూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దీపావళి వేళ రోడ్డు ప్రమాదాలు రెండు కుటుంబాల్లో విషాదం నింపాయి. తిరుచానూరు సీఐసునీల్ కుమార్ కథనం మేరకు తిరుపతి శివజ్యోతినగర్‌కు చెందిన పార్థసారధి(65) సోమవారం రేణిగుంట వైపు నుంచి ద్విచక్ర వాహనంపై తిరుపతికి వస్తుండగా దామినేడు సమీపంలో హైవేలో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో పార్థసారధికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓటేరు సమీపంలో స్కూటర్‌పై రోడ్డు దాటుతున్న చరణ్(17)ను మరో స్కూటరిస్టు ఢీకొనడంతో తీవ్రగాయాలై వెంటనే మృతి చెందాడు. మృతుల కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

ప్రొఫెసర్ రాఘవులు నాయుడి కన్నుమూత

● సీఎం చంద్రబాబుకు ఏడాది జూనియర్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ ఎకనమిక్స్ విభాగ రిటైర్డు ప్రొఫెసర్ బొల్లినేని రాఘవులు నాయుడు (78) మంగళవారం కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ప్రొఫెసర్ రాఘవులు నాయుడు తిరుపతి విద్యానగర్‌లోని సత్యసాయి కాలనీలో స్వగృహంలో మంగళవారం తుదిశ్వాస విడిచారు. పూతలపట్టు మండలం గాండ్లపల్లెకు చెందిన రాఘవులు నాయుడు నాలుగు దశాబ్దాల పాటు ఎకనమిక్స్ బోధన, పరిశోధన రంగాల్లో కృషి చేశారు. సీఎం చంద్రబాబుకు ఏడాది జూనియర్ కూడా. రాఘవులు నాయుడికి ముగ్గురు సంతానం. గురువారం ఉదయం స్వగృహంలో భౌతిక కాయాన్ని సందర్శనార్థం ఉంచనున్నారు. అనంతరం స్వగ్రామంలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

మాయమాటలతో వృద్ధురాలికి టోకరా

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మాయమాటల్లోకి దింపి వృద్ధురాలిని మెడలో చైను కాజేసిన వైనమిది.. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు... వెదురుకుప్పంకు చెందిన కళావతి సోమవారందీపావళి సందర్భంగా మార్కెట్‌లో మామిడి ఆకులు విక్రయిస్తోంది. ఓ మహిళ వద్దకు వచ్చి మాటలు కలిపి పక్క సందులోకి తీసుకెళ్లింది. చైను తీసి లోపల పెట్టుకో.. ఎవ్వరైనా తీసుకెళ్లిపోతారని నమ్మపలికింది. దీంతో కళావతి ఆమె మాటలు నమ్మి చైను తీసి ఒడిలో పెట్టుకుంది. సదరు మహిళ తన వద్ద వున్న మరో నకిలీ చైను ఆమెకు ఇచ్చి 16 గ్రాముల బంగారు చైన్‌ను తీసుకుని పరారైంది. బాధితురాలు ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో ఈమేరకు ఫిర్యాదు చేసింది.

పాకాల: మాయమాటలతో వృద్ధురాలిని మోసగించి బంగారు చైను అపహరించిన వైనమిది. గాదంకి పంచాయతీ బత్తినవారిపల్లెకు చెందిన కమలమ్మ అనే వృద్ధురాలు మంగళవారం ఆర్టీసీ బస్సులో పాకాలకు వచ్చింది. బస్సులో దొంగలున్నారని, బంగారు చైను తీసి బ్యాగులో పెట్టుకోవాలని ఇద్దరు మహిళలు ఆమెకు సలహా ఇచ్చారు. అందులోని ఓ మహిళ తాను చైను బ్యాగులో పెట్టుకున్నానంటూ నమ్మబలికి కమలమ్మ మెడలోని మూడు సవరాల చైను తీసి బ్యాగులో పెడుతున్నట్టుగా నటించింది. గిల్టు చైను బ్యాగులో పెట్టి బంగారు చైను తీసుకొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ సుదర్శన ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగ అరెస్ట్ : నగల స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పలు చోట్ల దొంగతనాలకు పాల్పడిన ఓ వ్యక్తిని ఈస్ట్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ ఈశ్వరయ్య కథనం మేరకు... కర్నాటకకు చెందిన సాయిప్రకాష్ తిరుమలలో ఫొటో ఫ్రేమ్‌లు విక్రయిస్తూ జీవనం గడుపుతుంటాడు. ఈక్రమంలో దురాశతో స్థానిక రిలయన్స్ వద్ద ఓ వ్యక్తికి చెందిన డిక్కీలో బంగారు నగలు అపహరించాడు. యూనివర్శిటీ పరిధిలోని ఓ ఇంటిలో 20 గ్రాముల బంగారు నగలు అపహరించాడు. ఇలా పలు చోట్ల చోరీలకు పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు నిందితుడిని మంగళవారం తుడాసర్కిల్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 36 గ్రాముల బంగారు నగలు, రూ.40వేల నగదు స్వాధీనం చేసుకుని, నిందితుడినిరిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యాచకురాలి మృతి

చంద్రగిరి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మామండూరు వద్ద హైవే సర్వీసు రోడ్డులో సోమవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యాచకురాలు మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు మామండూరు వద్ద సుమారు 60 ఏళ్ల వృద్ధురాలు బిక్షాటన చేసునేదిది. సోమవారం మామండూరు సర్వీసు రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. రుయా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హథీరాంజీ భవనాన్ని పునరుద్ధరించండి

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గోవిందరాజ స్వామి ఆలయ సమీపంలోని హథీరాంజీ భవనాన్ని పునరుద్ధరించాలని టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామి పట్ల భక్తితో హథీరాం బాబాజీ ఈ భవనం నిర్మించారన్నారు. భారతీయ శిల్పకళ శైలితో నిర్మించిన ఈ భవనం సరైన నిర్వహణ లేకపోవడంతో గోడలు, పైకప్పులు పగుళ్లతో దెబ్బతిన్నాయన్నారు. తిరుపతి నగర చరిత్రకు, కళావైభవానికి, భక్తి సాంప్రదాయానికి ప్రతీకగా ఉన్న ఈ భవనాన్ని కాపాడాలని కోరారు.

అప్రమత్తంగా ఉండండి

● టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుమలకు వచ్చే భక్తులు కాలనుగుణంగా ఎదుర్కొనే సమస్యలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. వేసవి, వానాలకాలం, మంచు కాలాలకు వేర్వేరుగా నిర్దేశిత ప్రణాళికలు తయారు చేయాలన్నారు. రెండు రోజులుగా వానలు భారీగా కురుస్తున్న క్రమంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికారులతో వరుస సమీక్షలు నిర్వహిస్తున్నారు. జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణతో కలిసి సోమ, మంగళవారాల్లో వర్చువల్ సమావేశాలు నిర్వహించి ముఖ్యమైన ఆదేశాలు జారీ చేశారు. కొండచరియలు, చెట్లు విరిగిపడితే ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు జేసీబీ వాహనాల ద్వారా తొలగించాలన్నారు. మొదటిఘాట్ రోడ్డులోని అక్కగార్ల ఆలయం, మాల్వాడిగుండం జలపాతాల వద్ద భక్తులు గుమికూడి సెల్ఫీలు తీసుకోకుండా నియంత్రించాలన్నారు. డిజాస్టర్ రెస్పాన్సివ్ టీంను కమాండ్ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేసి చీఫ్ ఇంజినీర్ నేతృత్వంలో విపత్తు స్పందన చర్యలు చేపట్టాలన్నారు. ఎలక్ట్రికల్, ఐటీ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

‘ముసురు’కున్న ఇబ్బందులు

తిరుపతి అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ముసురు వాతావరణం దీపావళిపై ప్రభావం చూపింది. బాణసంచా విక్రేతలు, ప్రజల ఆశలపై కొంతమేర నీళ్లు చల్లింది. ఆది, సోమవారాల్లో తెరపిలేని వాన కురిసింది. దీంతో టపాసుల దుకాణాల్లో అమ్మకాలు పల్చగా జరిగాయి. సోమవారం వర్షం ఆగిన సమయాల్లో టపాసులు తీసుకెళ్లినా పేల్చే సమయంలో ముసురు కొనసాగింది. టపాసులు వృధా అయ్యాయంటూ యువత నిరుత్సాహపడింది. వాణిజ్య సముదాయాలు కళతప్పాయి. వర్షాలకు నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెట్లు కూలిపోయాయి. పలుమార్లు ట్రాఫిక్ స్తంభించింది. నగరం నుంచి తూర్పుగా కాలువలు జోరుగా ప్రవహించాయి. కపిలతీర్థం, మాలాడిగుండం జలపాతాలు హోరెత్తాయి. మంగళవారం సెలవు కావడంతో స్కూల్ పిల్లలు ఊపిరిపీల్చుకున్నారు. అలిపిరి, కపిలతీర్థం, శేషాచల ముఖభాగంలో పొగమంచు దృశ్యాలు నగరవాసులను ఆహ్లాదపరిచాయి.


వర్షంలోనూ అలిపిరి పాదాలమండపం వద్ద పూజలు, రుయాలో గొడుగు సాయంతో రోగి తరలింపు

టీటీడీ ఆలయాలను ఆకస్మికంగా సందర్శిస్తాం

తిరుమల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దేశంలోని అన్ని శ్రీవారి ఆలయాలను ఆకస్మికంగా సందర్శిస్తామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు.అమరావతిలోని వెంకటపాలెం సమీపంలోఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు.. ఆలయంలో భక్తులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. ఈక్రమంలో గుర్తించిన లోపాలపై కొందరు సిబ్బందిపై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏనుగుల బీభత్సం

చంద్రగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేట పరిధిలో సోమవారం తెల్లవారుజామున విజయ్‌కుమార్ పొ లంలో ఏనుగులు దాడిచేశాయి. అరటి చెట్లు, కొబ్బరి చెట్లు, గడ్డి, పెన్సింగ్, బోర్ మోటార్ పైపులను ధ్వంసం చేశాయి. గ్రామస్తులు భయాందోళన చెందారు. అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. వారు అక్కడికి చేరుకుని రాత్రిపూట అప్రమత్తంగా ఉండాలని రైతులను అప్రమత్తం చేశారు.

అమరవీరులకు నివాళి

మంగళం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో మంగళవారం అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 31 వరకు అమరవీరులను స్మరిస్తూ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీఎస్పీ షరీఫ్, ఏసీఎఫ్ శ్రీనివాస్, సీఐలు సురేష్‌కుమార్, ఖాదర్ బాషా, ఆర్ఐలు సాయిగిరిధర్, కృపానంద, ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

మలబార్‌లో వెండి ఆభరణాల ప్రదర్శన

తిరుపతి అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ కూడలిలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో వెండి ఆభరణాల ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు షోరూం హెడ్ రిజీష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వెండి సామగ్రి, పట్టీలపై 25శాతం, ఇతర వెండి ఆభరణాల ఎమ్మార్పీ ధరలపై 10శాతం తగ్గింపు కల్పించామన్నారు. ఈ సదుపాయం ఈనెల 26వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ముక్కంటి ఆలయంలో పాము కలకలం

శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం పాము కలకలం రేపింది. ఆలయంలోని అమ్మవారి సన్నిధి వద్ద ఉన్న రాతి కట్టడం సమీపంలో పాము భక్తుల మధ్యకు చొరబడింది. కాసేపు భక్తులు భయాందోళన చెందారు. అటవీ శాఖ సిబ్బంది సాయంతో పామును పట్టుకుని కైలాసగిరి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

ఘాట్‌లో లారీ బోల్తా

చంద్రగిరి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని భాకరాపేట ఘాట్ రోడ్డులో మంగళవారం టమోటా లారీ బోల్తా పడింది. పోలీసుల కథనం మేరకు పీలేరు నుంచి విశాఖపట్నం టమోటా లోడ్డుతో లారీ వెళ్తోంది. భాకరాపేట ఘాట్ రోడ్డులోకి రాగానే లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఎవరికీ గాయాలు కాలేదు. పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతరంగ్‌లో ఎమరాల్డ్స్ విద్యార్థుల ప్రతిభ

తిరుపతి(విద్య), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఎస్వీయూ అంతర్ కళాశాలల యువజనోత్సవం యువతరంగ్‌లో ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. సృజనాత్మక, సాంస్కృతిక, మేథోపరమైన పలు విభాగాల్లో విద్యార్థులు విజేతలుగా నిలిచారు. క్విజ్, జానపద నృత్యం, కొరియోగ్రఫీ, స్పాట్ పెయింటింగ్, హిందీ ఉపన్యాస పోటీల్లో ప్రథమ స్థానాలను పొందారు. ఇంగ్లీష్ ఉపన్యాస పోటీ, హిందీ చర్చ, ఇంగ్లీష్ చర్చ పోటీల్లో ప్రథమ, తృతీయ స్థానాలను దక్కించుకున్నారు. విజేతలైన ఎమరాల్డ్స్ విద్యార్థులను రాష్ట్ర ఉన్నత విద్య సమాఖ్య వైస్ ఛైర్మన్ ఆచార్య విజయభాస్కర్‌రావు, ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఎమరాల్డ్స్ డైరెక్టర్లు డాక్టర్ గిరిధర్, సీఏ విశ్వనాథ్ అభినందించారు. అసిస్టెంట్ డైరెక్టర్లు మునిరత్నం, శ్రీనివాసులు, జానకిరామ్, నాదముని, ప్రిన్సిపల్ జాఫర్‌వల్లి పాల్గొన్నారు.


విజేతలతో ఆచార్య విజయభాస్కర్‌రావు, భూపతి నాయుడు, మునిరత్నం తదితరులు


రుయాలో రోగులకు అన్నదానం

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా రుయా ఆసుపత్రి ప్రాంగణంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీనివాస అధ్వర్యంలో పేదలకు,రోగులకు, అన్నదానం చేశారు. లయన్స్ ఇంటర్ నేషనల్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ ఆర్కాట్ కృష్ణప్రసాద్, బెల్లం కొండ సురేష్, శాంతినాడార్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

వర్షాలపై కార్పొరేషన్ అప్రమత్తత

- టోల్ ఫ్రీ నంబర్ల ఏర్పాటు

తిరుపతి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలో కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య సూచించారు. వర్ష బాధిత ప్రాంతాలను మంగళవారం ఆమె పరిశీలించారు. వర్షపు నీరు నిలవకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేశవాయన గుంట, పూర్ హోమ్ వద్ద వర్షపు నీటి సమస్యను పరిష్కరించామన్నారు. డ్రైనేజి కాలువల ద్వారా నీరు వస్తున్న ప్రాంతాలను సిబ్బంది పరిశీలించి పరిష్కరిస్తున్నామన్నారు. చెట్లు పడే అవకాశం ఉన్నా, డ్రైనేజీ కాలువలు పొంగినా, ఇతర సాయం కోసం .టోల్‌ఫ్రీ నంబర్లు 0877 22356776, 90008 22909 నంబర్లను సంప్రదించాలన్నారు.. కమిషనర్ వెంట వివిధ విభాగాల అధికారులున్నారు.











పుత్తూరు వార్తలు

లక్ష్మమ్మ కండ్రిగ కొత్త చెరువుకు గండి



మరమ్మతులను పరిశీలిస్తున్న తహసీల్దార్ తదితరులు

వడమాలపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మమ్మ కండ్రిగ, ఎస్టీ కాలనీ రోడ్డులోని కొత్త చెరువుకు సోమవారం గండి పడింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువు మట్టం పెరిగి కట్ట తెగింది. చెరువు కట్ట పైనే ఎస్టీకాలనీకి వెళ్లాల్సి ఉంది. కట్ట తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక టీడీపీ నాయకులు ఉదయ్ యాదవ్ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. చెరువుకు గండి పడిన ప్రదేశాన్ని, చేపడుతున్న పనులను తహసీల్దార్ జరీనా, ఆర్ఐ జానీబాషా, పంచాయతీరాజ్ అధికారులు పరిశీలించారు. మంగళవారం చెరువులో నీళ్లు తగ్గడంతో మరమ్మతులు చేపట్టారు. ఎక్సకవేటర్లు, ట్రాక్టర్లతో గండిని పూడ్చే పనులు ముమ్మరం చేశారు. సోమవారం నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు 49.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ జరీనా తెలిపారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి: ఎమ్మెల్యే భాను



పుత్తూరు అర్బన్, అక్టోబర్ 21(ఆంధ్రజ్యోతి): బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రానున్న మూడు రోజుల పాటు నగరి నియోజక వర్గంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. ప్రజలు తప్పని పరిస్థితుల్లోనే బయటకు వెళ్లాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలన్నారు. మండల, గ్రామస్థాయి అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. అవసరమైతే పునరావాస కేంద్రాల ఏర్పాటుకు సన్నద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఇబ్బందులను సచివాలయం, తహసీల్దార్ కార్యాలయానికి సమాచారం చేరవేయాలని కోరారు.

భోజన తయారీలో వాగ్వాదం...

వలస కార్మికుడి హత్య



నారీ నాయక్ మృతదేహం

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): భోజనం తయారీలో వంతుల విషయమై గొడవ ఒకరి హత్యకు దారి తీసింది. పుత్తూరు మున్సిపల్ పరిధిలోని చెర్లోపల్లిలో ఒడిశాకు చెందిన కార్మికుడు హత్యకు గురయ్యాడు. సీఐ శేఖర్ రెడ్డి తెలిపిన వివరాలు... శబరి క్వారీలో కూలి పని నిమిత్తం వచ్చిన ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా మోహిగూడకి చెందిన నారీనాయక్(45), రాజేష్‌నాయక్, రూపేష్‌నాయక్ ఒకే గదిలో అద్దెకు ఉంటున్నారు. రోజువారీగా భోజనం తయారు చేసుకోవడం, కూలి పనులకు వెళ్తుంటారు. కాగా, మంగళవారం మధ్యాహ్నం భోజనం తయారీలో నరేష్ నాయక్ వంతు వచ్చినా చేయకపోవడంతో రాజేష్‌నాయక్ అతన్ని ప్రశ్నించాడు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. రాజేష్ నాయక్‌కు రూపేష్ నాయక్ మద్దతుగా నిలిచాడు. ఈక్రమంలో నారీ నాయక్, రాజేష్‌నాయక్ గొడవ పడ్డారు. కోపోద్రిక్తుడైన రాజేష్ నాయక్ కూరగాయలు కోసే కత్తితో నరేష్ నాయక్‌ను పొడిచాడు. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పుత్తూరు డీఎస్పీ రవికుమార్, సీఐ శేఖర్ రెడ్డి, సిబ్బందితో సంఘటనా స్థలం చేరుకుని వివరాలు ఆరా తీశారు. మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా దీపావళి ఆస్థానం



వడమాలపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో దీపావళి ఆస్థానాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవారం దీపావళి పండుగ సందర్భంగా సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి నిత్య కైంకార్యాలు నిర్వహించారు. అనంతరం మూలవర్లు, ఉత్సవ విగ్రహాలను పట్టు పీతంబరాలతో, పూలమాలలు, విశేష ఆభరణాలతో అలంకరించారు. అనంతరం ఉభయ దేవేరులతో ప్రసన్న వెంకన్న మాడవీధుల్లో ఊరేగింపు. ఆలయ ప్రాంగణానికి స్వామిఅమ్మవార్లను వేంచేపు చేయించి ఆలయ అర్చకులు వేదమంత్రాలు పఠిస్తూ భక్తుల గోవింద నామ స్మరణల నడుమ మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలతో దీపావళి ఆస్థానాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి వేణుగోపాల్, తిప్పయ్య ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కేదార గౌరీ వ్రతం

పుత్తూరు టౌన్, అక్టోబర్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలయాల్లో గౌరీ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్థానిక కామాక్షి సమేత సదాశివేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం గౌరీ వ్రతాన్ని నిర్వహించారు. అర్చకులు మురళి గురుకుల్ ఆధ్వర్యంలో కలశోద్వాసన, వినాయక పూజ నిర్వహించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పూల మాలలతో అలంకరించారు. గౌరీ దేవి వ్రత కథ చెబుతూ, నోము దారాలకు పూజలు చేయించారు. అమ్మవారికి నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం పూజలు చేసిన నోము దారాలను వేద మంత్రాల నడుమ వ్రతం చేసిన మహిళల మణికట్టుపై ధారణ చేయించారు. అమ్మవారికి మహా హారుతులిచ్చి తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దిలీప్ కుమార్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వడమాలపేటలో...

వడమాలపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉమామహేశ్వర ఆలయంలో మంగళవారం కేదార గౌరీ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు శివ, సాయి ఆధ్వర్యంలో కలశ స్థాపన, వినాయక పూజ నిర్వహించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పూలమాలలతో విశేషంగా అలంకరించి కేదార గౌరీ వ్రతాన్ని నిర్వహించారు. అనంతరం నోము దారాలను వ్రతం చేసిన మహిళలకు పంపిణీ చేశారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న లారీ

- విడిపోయిన ముందు భాగంలో టైర్లు
- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీకాళహస్తి - తడ రోడ్డు కారణిమిట్ట సమీపంలోని మలుపు దగ్గర అదుపు తప్పిన లారీ చెట్టును ఢీకొంది. దీంతో లారీ ముందు భాగం టైర్లు విడిపోవడం వలన డ్రైవర్‌కు త్రీవగాయాల య్యాయి. చైన్నె నుంచి శ్రీకాళహస్తికి సోమవారం రాత్రి వస్తుండగా కారణిమిట్ట సమీపంలో మలుపును గమనించని డ్రైవర్ చెట్టును ఢీకొన్నాడు. దీంతో లారీ ముందు భాంగంలో ఉన్న రెండు టైర్లు విడిపోయాయి. డ్రైవర్ తీవ్రంగా గాయపడా చికిత్స నిమిత్తం చెన్నైకు తరలించారు.







సూళ్లూరుపేట: షార్ రోడ్డులో కాలువలా వర్షపునీరు - పెళ్లకూరు: చిల్లకూరులో పొలాల్లో చేరిన వర్షపు నీరు - కోట: గోవిందపల్లిపాళెం వద్ద సముద్రపు ఒడ్డుకు చేరిన పడవలు, వలలు

విస్తారంగా వర్షాలు

పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు

సూళ్లూరుపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. సూళ్లూరుపేట పట్టణంలోని శివారు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కాళంగి నదికి భారీగా నీరు చేరింది. నెర్రికాలువ, పుచ్చా కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. స్థానిక హోలిక్రాస్ కూడలి నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు వరకు జీఎన్‌టీ రోడ్డుపై వర్షపునీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. శ్రీహరికోటకు వెళ్లే రోడ్డు షార్ వై జంక్షన్ నుంచి గురుకుల పాఠశాల, సాయిబాబ ఆలయం వరకు రోడ్డుపై మోకాళ్లలోతు నీరు నిలవడంతో వాహనదారులకు అవస్థలు తప్పలేదు. పట్టణంలోని సాయినగర్‌ను వర్షపునీరు చుట్టిముట్టింది. అదేవిధంగా వట్రపాలెం, వనంతోపు, గాండ్లవీధి, మున్సిపల్ కార్యాలయం వీధి, ఇసుకుమిట్ట, రాజీవ్‌నగర్, కసారెడ్డిపాలెం ప్రాంతాల్లో రోడ్లపై వర్షపునీరు చేరడంతో నివాసాల నడుమ మడుగను తలిపిస్తున్నాయి. తహసీల్దార్ గోపినాథరెడ్డి, మున్సిపల్ కమిషన్ చిన్నయ్య, ఇరిగేషన్ ఏఈ రమేష్ అధికారులతో కలిసి లోతట్టు ప్రాంతాలను పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. సాయినగర్, సూళ్లూరు ప్రాథమిక పాఠశాల, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ గోపినాథ్ రెడ్డి తెలిపారు. ప్రజలకు ఎలాంటి అవసరమొచ్చినా 08623 244122, 9849904074 నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

దొరవారిసత్రం: మండలంలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 94.6 మి.మీ వర్షపాతం నమోదైంది. చెరువులు, కుంటలు, కాలువల్లో నీరు చేరింది. కల్లూరుకండ్రిగ వద్ద పేట - వాకాడు ఆర్‌అండ్‌బీ రహదారి, తనియాలిలోని ఆర్‌అండ్‌బీ రహదారిపై గోతుల్లో వరదనీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నాయి.

నాయుడుపేట టౌన్: మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. స్వర్ణముఖినదికి జలకళ సంతరించుకుంది. నాయుడుపేట - వెంకటగిరి పాత రహదారి గుంతల మయంగా మారడంతో రాకపోకలు స్తంభించాయి.

కల్లోల భరితంగా సముద్రం

కోట: మండలంలో కురుస్తున్న వర్షాలకు సముద్రం కల్లోల భరితంగా మారింది. అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతుండటంతో మత్స్యకారులు చేపల వేట ఆపేశారు. మండంలోని చెరువుల్లో వర్షపునీరు నిల్వచేరుతోంది. అదేవిధంగా స్వర్ణముఖినదిలోకి స్వల్పంగా వరదనీరు చేరింది. స్వర్ణముఖి ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు వస్తుండటంతో గూడలి వద్ద నుంచి మామిడి కాలువ, చల్లకాలువ పారుతోంది. గూడలి స్వర్ణముఖినది నుంచి వాకాడు బ్యారేజీలోకి వరదనీరు భారీగా వెళ్తోంది.

వెంకటగిరి టౌన్: అల్పపీడన దోరణి కారణంగా గత రెండు రోజులుగా ఎడతెరపిలేని వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం అర్థరాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు ఆగకుండా వర్షం పడుతుంది. మండలంలోని నాలుగు చెరువులు 25శాతం నిండాయని అధికారులు తెలిపారు. వెలుగొండల అడవుల్లో నుంచి వచ్చే వర్షపు నీటితో కౌవల్యానది నిండుకుండలా ప్రవహిస్తోంది. మరో రెండు రోజులుగా పాటు వర్షాలు కురవనుండడంతో పట్టణంలోని సవారిగుంట, కౌవల్యానది ఒడ్డు ప్రవాహక ప్రాంతం, కాంపాళెం గోడ్డేవాగు పరిసర ప్రాంతాల్లో స్థానికులను అధికారులు అప్రమత్తం చేశారు.

బాలాయపల్లి: మండలంలో సోమవారం అర్ధరాత్రి నుండి ఎడతెరిపి లేని వర్షం కురుస్తుంది. వాగులు, కాలువలు నీటితో నిండాయి. జయంపు గ్రామంలోని చెరువుకట్ట కలుజు కోతకు గురైంది. ఏఈ వెంకటేశ్వర్లు, వీఆర్వో చైతన్య ఉన్నతాదికారులకు సమాచారం అందించారు. గండి పడితే చెరువులో నీరు ఇళ్లపైకి వచ్చే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వర్షాలకు చెరువులు దెబ్బతినకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు,

గూడూరు: పట్టణంలో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. విడతల వారీగా జల్లులు కురుస్తుండడంతో స్థానిక ఏపీరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో నీరు నిల్వచేరింది. పట్టణంలోని ప్రధాన రహదారులపై నీరు చేరడంతో పాదాచారులు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడ్డారు.

ఓజిలి: రెండు రోజులుగా ఎడతెరిపి లేని వర్షం కారణంగా మండలంలో జనజీవనం స్థంభించింది. వాగులు, వంకలు, దొరువులు ప్రవాహిన్నాయి. కరబల్లవోలు సచివాలయం జల దిగ్బంధంలో ఉంది.

పెళ్లకూరు: మండలంలో కుండపోత వర్షం కురుస్తోంది. మంగళవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. మండలంలోని అన్ని చెరువులకు వరదనీరు వచ్చి చేరుతోంది.

చిట్టమూరు: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిట్టమూరు తహసీల్దార్ నరేష్ కోరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. భారీ వర్షాల వల్ల వరదలు సంభవిస్తే లోతట్టు గ్రామాల ప్రజలను సురక్షితమైన ప్రాంతాలకు చేర్చాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో చిట్టమూరులో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో డీటీ నిరంజన్ కుమార్, ఆర్ఐ సుధ, మధులత, వీఆర్వోలు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలోనే కక్ష్య సాధింపు చర్యలు: విజయశ్రీ



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కక్ష్య సాధింపులకు పాల్పడి టీడీపీ శ్రేణులతో పాటు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి కేసులు పెట్టింది వైసీపీ ప్రభుత్వ హయాంలోనేనని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆమె మీడియాతో మాట్లాడుతూ తడ మండలం పూడికి చెందిన వైసీపీ సర్పంచ్ పరమశివంరెడ్డిపై 2010 నుంచి క్రిమినల్ కేసులు ఉన్నాయని, ఆ విషయం తెలుసుకోకుండా కూటమి ప్రభుత్వంలో కేసులు నమోదు చేస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే విమర్శించడం దారుణమన్నారు. 2010లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పరమశివంరెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేసిన విషయం తెలియదా అని ప్రశ్నిం చారు. సొంత పార్టీ నాయకుడిపైనే క్రిమినల్ కేసులు నమోదు చేశారంటే అతని నేర ప్రవృత్తి ఎటువంటిదో అర్థం చేసుకోవాలన్నారు. చెరువు ఆధునికీకరణ పనుల పరిశీలనకు వెళ్లిన ఇరిగేషన్ అధికా రులను, టీడీపీ నేతను అడ్డగించి దాడి చేస్తేనే కేసులు నమోదు చేశారని స్పష్టం చేశారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్, టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, బొమ్మన పళణి, సెల్వం, శ్రీనివాసులు నాయుడు, టీకే శ్రీని వాసన్, వేలూరు చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి

డక్కిలి/వెంకటగిరి: అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు విద్యార్థులు నివాళులర్పించారు. మంగళవారం సాయంత్రం డక్కిలి కమ్మపల్లి రోడ్డు సెంటరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు పోలీసులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ శివశంకర్, ఎంఈవో జగదీష్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే వెంకట గిరిలోని గురుకుల బాలికల పాఠశాలలో పోలీసు అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథ నాయుడు, సీఐ రమణ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేని

వెంకటగిరి టౌన్, అక్టోబరు 21,(ఆంధ్రజ్యోతి): అమరులైన పోలీసులు త్యాగాలు మరువలేనవి 9వ బెటాలియన్ కమాండెంట్ ఈఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల పరధిలోని బెటాలియన్‌లో పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ముందుగా అమరవీరులు ఘాట్ వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.

మాయమాటల్లోకి దింపి బంగారు చైను అపహరణ

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మాయమాటల్లోకి దింపి వృద్ధురాలిని మెడలో చైను కాజేసిన వైనమిది.. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు... వెదురుకుప్పంకు చెందిన కళావతి సోమవారందీపావళి సందర్భంగా మార్కెట్‌లో మామిడి ఆకులు విక్రయిస్తోంది. ఓ మహిళ వద్దకు వచ్చి మాటలు కలిపి పక్క సందులోకి తీసుకెళ్లింది. చైను తీసి లోపల పెట్టుకో.. ఎవ్వరైనా తీసుకెళ్లిపోతారని నమ్మపలికింది. దీంతో కళావతి ఆమె మాటలు నమ్మి చైను తీసి ఒడిలో పెట్టుకుంది. సదరు మహిళ తన వద్ద వున్న మరో నకిలీ చైను ఆమెకు ఇచ్చి 16 గ్రాముల బంగారు చైన్‌ను తీసుకుని పరారైంది. బాధితురాలు ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో ఈమేరకు ఫిర్యాదు చేసింది.

పలు ప్రాంతాల్లో నగలు, నగదు అపహరిస్తున్న నిందితుడి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పలు చోట్ల దొంగతనాలకు పాల్పడిన ఓ వ్యక్తిని ఈస్ట్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్ఐ ఈశ్వరయ్య కథనం మేరకు... కర్నాటకకు చెందిన సాయిప్రకాష్ తిరుమలలో ఫొటో ఫ్రేమ్‌లు విక్రయిస్తూ జీవనం గడుపుతుంటాడు. ఈక్రమంలో దురాశతో స్థానిక రిలయన్స్ వద్ద వినియోగదారులు డిక్కీలో ఉంచిన బంగారు నగలు అపహరించాడు. అంతకు మునుపు యూనివర్శిటీ పరిధిలోని ఒక ఇంటిలో 20 గ్రాముల బంగారు నగలు అపహరించాడు. ఇలా పలు చోట్ల చోరీలకు పాల్పడిన నేపథ్యంలో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఈస్ట్ పోలీసులు నిందితుడిని మంగళవారం తుడాసర్కిల్‌లో అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 36 గ్రాముల బంగారు నగలు, రూ 40,000 రికవరీ చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం



మృతి చెందిన పార్థసారథి

తిరుచానూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దీపావళి వేళ రోడ్డు ప్రమాదాలు రెండు కుటుంబాల్లో విషాదం నింపాయి. తిరుచానూరు సీఐసునీల్‌కుమార్ కథనం మేరకు తిరుపతి శివజ్యోతినగర్‌కు చెందిన పార్థసారథి(65) సోమవారం రేణిగుంట వైపు నుంచి ద్విచక్ర వాహనంపై తిరుపతికి వస్తుండగా దామినేడు సమీపంలో హైవేలో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో పార్థసారధికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓటేరు సమీపంలో స్కూటర్‌పై రోడ్డు దాటుతున్న చరణ్(17)ను మరో స్కూటరిస్టు ఢీకొనడంతో తీవ్రగాయాలై వెంటనే మృతి చెందాడు. మృతుల కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఘాట్ రోడ్డులో లారీ బోల్తా

చంద్రగిరి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని భాకరాపేట ఘాట్ రోడ్డులో మంగళవారం టమోటా లారీ బోల్తా పడింది. పోలీసుల కథనం మేరకు పీలేరు నుంచి విశాఖపట్నం టమోటా లోడ్డుతో లారీ వెళ్తోంది. భాకరాపేట ఘాట్ రోడ్డులోకి రాగానే లారీ అదుపు తప్పి బోల్తా పడింది. లారీ డ్రైవర్, క్లీనర్లకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. చంద్రగిరి చేరుకుని కేసు నమోదు చేశారు.

పోలీసులపై ఆరోపణలు సరికాదు: సీఐ

తడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏడు క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తిని బైండోవర్ చేసేందుకు పిలిస్తే, అసత్య ఆరోపణలతో పోలీసులపై నిందలు మోపడం తగదని సూళ్లూరుపేట సీఐ మురళీ కృష్ణ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పూడి గ్రామానికి చెందిన పరమశివంరెడ్డిపై పలు నేరాలకు సంబంధించి కేసులు నమోదై ఉండడంతో పాటు తరచూ ఫిర్యాదులు వస్తుండటంతో కేసులు నమోదు చేశామన్నారు. నేరచరిత్ర కలిగిన వ్యక్తిని బైండోవర్ చేసేందుకు పిలిస్తే.. పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారంటూ కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. పూర్తి వివరాలు తెలుసుకోకుండా పోలీసులపై ఆరోపణలు చేస్తే కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు.

నిమ్మసాగులో జాగ్రత్తలు పాటించాలి

గూడూరు అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నిమ్మ సాగులో రైతులు జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగు బడులు సాధించవచ్చునని ఉద్యానవనశాఖ అధికా రిణి సునీత అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ నేలకు తాకుతున్న కొమ్మలను కత్తిరించి గాలి, వెలుతురు మొక్కకు సోకేట్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాల తరువాత బొబ్బర తెగులు ఆశించే అవకాశం ఉంటుందని, దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్, స్ట్రెప్టోసైక్లిన్ కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు.

28న సాంస్కృతిక పోటీలు

తిరుపతి అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ, రాష్ట్రస్థాయి యువజనోత్సవాలలో కళాకారులు ప్రాతినిథ్యం వహించేందుకు ఈనెల 28న ఒక ప్రైవేటు కళాశాలలో సాంస్కృతిక పోటీలు జరుగుతాయని సెట్విన్ సీఈవో డాక్టర్.పి.యశ్వంత్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జానపద నృత్యాలు, గీతాలు, కవిత్వం, కథలు రావయం, పెయింటింగ్ వంటి జీవన నైపుణ్య విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. అర్హత, ఆసక్తి గల 15నుంచి 25సంవత్సరాల వయస్సు కలిగిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 0877-2286921, 8341111687 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పొలాల్లో ఏనుగుల భీభత్సం



ఏనుగుల దాడిలో ధ్వంసమైన అరటి చెట్లు

చంద్రగిరి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేట పరిధిలో సోమవారం తెల్లవారుజామున విజయ్‌కుమార్ పొలంలో ఏనుగులు దాడిచేశాయి. అరటి చెట్లు, కొబ్బరి చెట్లు, గడ్డి, ఫెన్సింగ్, బోర్ మోటార్ పైపులను ధ్వంసం చేశాయి. గ్రామస్తులు భయాందోళన చెందారు. అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. అటవీ అధికారులు అక్కడికి చేరుకున్నారు రాత్రిపూట అప్రమత్తంగా ఉండాలని రైతులను అప్రమత్తం చేశారు. మంగళవారం రాత్రి కందులవారిపల్లి, నారావారిపల్లి, నాగపట్ల, కళ్యాణిడాం పీటీసీ, రంగంపేట ప్రాంతాలలో కూడా సంచరించే అవకాశం ఉందని చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యాచకురాలి మృతి

చంద్రగిరి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మామండూరు వద్ద హైవే సర్వీసు రోడ్డులో సోమవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యాచకురాలు మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు మామండూరు వద్ద సుమారు 60 ఏళ్ల వృద్ధురాలు బిక్షాటన చేసునేదిది. సోమవారం మామండూరు సర్వీసు రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించి రుయా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పులికాట్‌కు జలకళ

సూళ్లూరుపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నిన్న మొన్నటి వరకు నీరులేక వెలవెలబోయిన పులికాట్ సరస్సు రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు నిండుకుండను తలపిస్తోంది. వర్షపు నీటితో పాటు ఇటు కాళంగి నది, పాముల కాలువ నుంచి సరస్సుకు భారీగా నీరు చేరడంతో పులికాట్ తీరం సముద్రాన్ని తలపిస్తోంది. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో పులికాట్ సరస్సులోకి మత్స్యకారులు వేటకు వెళ్లరాదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

కాళంగి వంతెనను పరిశీలించిన ఆర్డీవో

దొరవారిసత్రం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని తనియాలి వద్ద కాళంగి నదిపై వంతెనను సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి మంగళవారం పరిశీలించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కాళంగి నదికి వరద నీరు చేరుతోంది. తనియాలి వంతెనపై నీరు ప్రవాహిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు ఆర్డీవో సూచనలు చేశారు. ఆమె వెంట తహసీల్దారు శైలాకుమారి, ఎస్ఐ అజయ్‌కుమార్ ఉన్నారు.

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

తడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు శరత్‌బాబు అన్నారు. పుదుచ్చేరి కేంద్రంగా అల్పపీడన ప్రభావంతో ఈనెల 25 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

గూడూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని పలువురు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని విజిలెన్స్ ఏవో రామాంజనేయరెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలోని విత్తనాల దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, విత్తనాలు సరఫరా చేసే కంపె నీల ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. తప్పనిసరిగా రైతులకు బిల్లులు ఇవ్వాలని, అందులో విత్తనం, కంపెనీ పేరు తప్పనిసరిగా పొందు పరచాలన్నారు.

ఒకటో పట్టణ ఎస్ఐగా మనోజ్ కుమార్

గూడూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఒకటో పట్టణ ఎస్ఐగా మనోజ్ కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న తిరుపతయ్య గూడూరు రూరల్‌కు బదిలీ అయ్యారు.

లోతట్టు ప్రాంతాల గిరిజనులను ఆదుకోవాలి

శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న గిరిజన కుటుంబాలను రెవెన్యూ యంత్రాంగం ఆదుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య కోరారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కూలి పనులు లేక ఇళ్లకే పరిమితమైన యానాదులకు, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారికి నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు.

శాస్త్రోక్తంగా కేదారేశ్వర వ్రతం



భద్రావతి సమేత భావనారుషిస్వామి ఆలయంలో కేదారగౌరీ వ్రతాన్ని ఆచరిస్తున్న భక్తులు

ఏర్పేడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాల్లో అమావాస్య సందర్భంగా కేదారేశ్వర వ్రతాన్ని ఆచ రించారు. మండలంలోని చిందేపల్లిలోని పార్వతి సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నోముల కార్యక్రమాన్ని నిర్వహించారు. గుడిమల్లం ఆలయంలో ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ గిరినాయుడు, ఈవో రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కేదారేశ్వర వ్రతాన్ని నిర్వహించారు. మర్రిమందలోని హయగ్రీవ స్వామి ఆలయంలో కూడా వేదపండితులు ప్రత్యేక హోమాలు నిర్వహించారు.

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలమంగలం ఉత్తరంలో కొలువై ఉన్న భద్రావతి సమేత భావనారుషిస్వామి ఆలయంలో మంగళవారం కేదార గౌరీ వ్రతాన్ని నిర్వహించారు. మహిళా భక్తులు వ్రతాన్ని ఆచరించారు. వ్రతం ఆలయ కమిటీ అధ్యక్షులు హరి, ఉపాధ్యాక్షులు మునస్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై సూర్యనారాయణస్వామి అభయం

తిరుచానూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఇక్కడ కొలువైన సూర్యనారాయణస్వామికి సోమవారం తిరుచ్చి ఉత్సవం జరిగింది. స్వామివారి జన్మనక్షత్రం హస్త పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజలు,అభిషేకం నిర్వహించారు. సాయంత్రం బంగారు తిరుచ్చిపై స్వామివారిని తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విలీనం ఆపాలంటూ...

మౌన నిరాహార దీక్షకు దిగిన వేడాం గ్రామస్తులు


మౌన దీక్ష చేస్తున్న వేడాం విద్యార్థుల తల్లిదండ్రులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని వేడాం పెద్దమిట్టకండ్రిగ ఎంపీపీ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు మంగళవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద మౌన నిరాహార దీక్ష చేశారు. వానను లెక్కచేయకుండా ఉద యం నుంచి దీక్ష కొన సాగిం చారు. అంతకు ముందు గ్రామంలోని పాఠశాలకు తాళాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దమిట్టకండ్రిగలోని ఎంపీపీ పాఠశాలను సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నమిట్టకండ్రిగ పాఠశాలలో విలీనం చేయడం వల్ల వర్షాకాలంలో వాగులు, వంకలు పొంగిప్రవహించే సమయంలో తమ పిల్లలు అవస్థలు పడుతున్నారన్నారు. తమ గ్రామంలో పాఠశాలను యధావిధిగా కొనసాగించాలన్నారు. పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. ఎంపీడీవో పెంచల శ్యామ్, ఎంఈవో బాలయ్య అక్కడికి చేరుకుని వారినుంచి అర్జీ స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి రెండురోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవారెడ్డి, మనోహర్, బాబూజీ, అంజి, సుబ్రహ్మణ్యం, మురగ, రోసిరెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మల్లిమడుగు రిజర్వాయరుకు చేరుతున్న నీరు



రేణిగుంట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లిమడుగు రిజర్వాయరుకు నీరు చేరు తోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు శేషాచలం, మామండూరు అటవీ ప్రాంతంలోని కొం డల నుంచి నీరు చేరుతోంది. మంగళవారం సాయంత్రానికి రిజర్వాయర్‌లో 358.9 ఎఫ్‌టీల నీరుంది. మరో నాలుగు అడుగుల మట్టం పెరిగితే డ్యాం పూర్తిగా నిండుతుందని డీఈ చంద్రమౌళి తెలిపారు.

మండల అభివృద్ధిపై దృష్టి సారించండి: జడ్పీ సీఈవో


అభివృద్ధి పనులపై దిశానిర్దేశం చేస్తున్న జడ్పీసీఈవో

నారాయణవనం, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అ తీతంగా మండల అభివృద్ధిపై దృష్టి సారించాలని జడ్పీ సీఈవో రవి కుమార్ నాయుడు ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఎంపీ డీవో కార్యాలయంలో ఆయన ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామ్ యోజన(పీఎంఏజీవై) పనులపై స మీక్షించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యు డు సుమన్ కుమార్ మండలంలో ఉపాధి హామీ సహా ఇతర పనులను వివరించారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చర్య లు తీసుకోవాలని జడ్పీసీఈవో సూచించారు. ఎంపీడీవో అరుణ, ఏపీఎం సుకన్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, నారాయణవనం, బొప్పరాజపాలెం, వెంకటకృష్ణాపాలెం సర్పంచులు పాల్గొన్నారు.

ట్రంప్ దిష్టిబొమ్మ దహనం

సత్యవేడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భారతదేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే విధంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యవహరిస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి రమేష్ మండి పడ్డారు. పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో ట్రంప్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ... 11 శాతం ఉన్న సుం కాలను 50 శాతానికి పెంచి దేశ వ్యవసాయ, పాడి ఉత్పత్తులను నాశనం చేయాలని యత్నిస్తున్నట్లు విమర్శించారు. చిన్న దేశాలైన క్యూబా, వియాత్నాం, వెనిజులా లాంటి దేశాలు ట్రంప్‌ను లెక్క చేయకుండా ఎదురు తిరిగి పోరాడుతుంటే పీఎం మోదీ చర్యలు తీసుకోక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్ర మంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అరు ణాచలం, ఎస్ఎఫ్ఐ నాయకుడు మురళి, కార్మిక సంఘం నాయకులు కృష్ణయ్య, తిరుమల రెడ్డి వెంకటేశం, లక్ష్మయ్య, మునస్వామి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయ పేడులో సీఐటీయూ ఆధ్వర్యంలో భారత దేశంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలకు వ్యతిరేకంగా మంగళవారం నిరసన వ్యక్తం చేసి ఆయన చిత్రపటాన్ని దహనం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్దన్, బాలయ్య, నాగూరు, లోకనాథం, సుబ్బరామయ్య, అనిత, శీను, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నారాయణవనం(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలమంగళంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశంపై విధించిన సుంకాలపై వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సీఐటీయూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

కార్తీక సోమవారం అంతరాయల దర్శనం నిలిపివేత

శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీకమాసంలో ప్రతి సోమవారం అంతరాలయం దర్శనం నిలిపివేస్తున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పెద్దసంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో ప్రతి కార్తీక సోమవారం, కార్తీక పౌర్ణమి రోజునస్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం నిలిపివేస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఇందుకు సహకరించాలని ఆయన కోరారు.

వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయుడికి సోమవారాన్ని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. తొలుత వినాయకుడికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం సహా పూజలు నిర్వహించారు. అనంతరం మృత్యుం జయుడిని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూ రంతో అభిషేకించి గజమాల, వెండి నాగాభరణంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

ముక్కంటికి కార్తీక దీపం వితరణ



శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆలయ భజంత్రీ గోలి రాజాచౌదరి కార్తీక దీపాన్ని ఈవో బాపిరెడ్డికి అందించారు. కాగా కార్తీక మాసమంతా ఈ దీపానికి అవసరమయ్యే నెయ్యిని రాజులకండ్రిగకు చెందిన శ్రీరంగం మిల్క్ ప్రొడక్ట్సు నిర్వాహకులు అందించారు.

బంగారు తొడుగు రుద్రాక్షల మాల...




● శ్రీకాళహస్తీశ్వరాలయానికి బికొత్తకోట కు చెందిన ఉషారాణి దంపతులు మంగళ వారం రూ.3లక్షల విలువైన 25 గ్రాములు బంగారం తొడిగిన రుద్రాక్షలను ఈవో బాపిరెడ్డికి అందజేశారు. వాటిని ఆయన స్వీకరించి దాతలకు స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎనిమిదిమంది జూదరుల అరెస్టు

శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎనిమిది మంది జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. బుచ్చినాయుడుకండ్రిగ సీఐ తిమ్మయ్య తెలిపిన వివరాలు... తొట్టంబేడు మండలం కాసరం గ్రామంలో పేకాట స్థావరం నిర్వహిస్తున్నట్లు సమాచారం సేకరించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం సీఐ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఎనిమిదిమందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5,040 ను సీజ్ చేసినట్లు తెలిపారు.

పోలీసు అమరవీరులకు నివాళి



బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు ఎస్ఐ ఆధ్వర్యంలో నివాళులర్పిం చారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ దినం సంద ర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ హరి ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా అమరులైన పోలీసుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

ఆలయాల్లో అమావాస్య పూజలు

నారాయణవనం, అక్టోబర్ 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలయాల్లో మంగళవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. వీరరాఘవస్వామి దేవస్థానం, సొరకాయల స్వామి ఆలయం, కైలాసనాథ కోనలో శివశక్తి, శాంతి ఆశ్రమాలలో అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు.

తూర్పున భారీ వర్షం


శ్రీకాళహస్తి పట్టణంలోని జయరామరావు వీధిలో వర్షపునీరు



అలత్తూరు వద్ద పంది కాలువ ఉధ్రుతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీదేవి - సీతారాంపేట చెరువుకు మరమ్మతులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో రెండురోజుల పాటు విడిచి విడిచి కుంభవృష్టిగా వర్షం కురిసింది. సోమవారం దీపావళి పర్వదినం రోజున ఉదయం 8నుంచి 10.30గంటల వరకు భారీ వర్షం కురిసింది. తిరిగి మళ్లీ సాయంత్రం 4 నుంచి 6గంటల వరకు ఎడతెరపి లేకుండా కుండపోతగా వర్షం పడింది. తరువాత మళ్లీ అర్ధరాత్రి జోరువాన కొనసాగింది. ఇక మంగళవారం వేకువజామున నుంచి ఉదయం 9.30గంటలవరకు విస్తారంగా కురిసింది. తరువాత మధ్యాహ్నం 12 నుంచి 3.00గంటల వరకు కుమ్మరించింది. దీంతో పట్టణంలో లోతట్టు వీధులు జలమయం అ య్యాయి. తొట్టంబేడు మండలంలోని రౌతుసూర మాలతో పాటు పలు గ్రామాలు, శ్రీకాళహస్తి మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లపై నీరు చేరింది.

నాయకులూ... అప్రమత్తం

● వర్షాల నేపథ్యంలో కూటమి నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే సుధీర్ మంగళవారం ప్రకటన విడుదల చేశారు. రైతులు కోతలు చేయరాదన్నారు. అదే విధంగా కళ్లాలో ఉన్న పంటలపై టార్పాలిన్ పట్టలను కప్పాలన్నారు. కూటమి నాయకులు, అధికా రులు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచిం చారు. భారీ వర్షాలకు చెరువులు, కుంటలకు గండ్లు పడే అవకాశం ఉన్నందున అధికారులు అక్కడి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో పలు వాగులు, వంకలు కదిలాయి. కొన్ని గ్రామాల్లోని చెరువు ల్లోకి నీరు చేరింది. గుడిమల్లం వద్ద సీతకాలువ దాటనీయలేదు. దీంతో గుడిమల్లం ఆలయానికి వచ్చిన భక్తులను ఆలయ నిర్వాహకులు ట్రాక్టరు ద్వారా కాలువను దాటించారు. అదే విధంగా వికృతమాల నీలాద్రి నిలయం వద్ద వరవ కాలువలో పూడికతను తెలుగుయువత నాయ కుడు, మాజీ సర్పంచ్ హేమాక్షి రాయల్ ఆధ్వ ర్యంలో తొలగించారు. మండలంలోని సీతారాం పేట చెరువుకు బొగడ పడి నీరు వెళ్లిపోతు న్నాయి. ఈ క్రమంలో గుర్తించిన టీడీపీ ఏర్పేడు మండల అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి మరమ్మ తులను చేయించారు. ఈ కార్యక్రమంలో నరసింహులు, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో ద్రోణి ప్రభావంతో మండలంలో గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. రోజంతా అప్పుడప్పుడు వర్షం కురుస్తుండడంతో వీధులు జలమయంగా మారాయి. వర్షాలకు తోడు చలి గాలులు వీస్తుండడంతో వృద్ధులు, పిల్లలు అసౌకర్యానికి గురయ్యారు. వాగులు, వంకల్లో కొత్తనీరు చేరడంతో జలకళ సంత రించుకుంది. మండలంలో సోమవారం 11.2 మి.మీ, మంగళ వారం 20.2 మి.మీల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టా లని ఎమ్మెల్యే ఆదిమూలం అధికారులకు సూ చించారు. అరణియార్, కాళంగి ప్రాజెక్టులపై నిఘా పెంచాలని ఆదేశించారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం ఏర్పడినట్లు వాతావరణ శాఖ హెచ్చరించిందని, దీని ప్రభావంతో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాం తాల్లో ఉన్న వారు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని కోరారు. అరణియార్, కాళంగి రిజర్వా యర్ల వద్ద సంబంధిత అధికారులు అప్రమ త్తంగా ఉంచాలని సూచించారు. ఎక్కడైనా వర్షాల వల్ల ఇబ్బంది కలిగితే ఆయా పంచాయ తీ కార్యదర్శులు, వీఆర్వోలు అధికారులకు సమాచారం చేరవేయాలన్నారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): వర్షాలపై అప్రమ త్తంగా ఉండాలని ఎంపీడీవో రవిచంద్ర సూచిం చారు. సచివాలయ సిబ్బందితో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడు తూ మరో మూడు రోజులపాటు తుపాన్ కార ణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంద న్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు సమీ క్షిస్తూ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని తెలిపారు. తుపాన్ నేపథ్యంలో ఎంపీ డీవో కార్యాలయంలో అధికా రులు, సిబ్బంది నిరంతరాయంగా అందుబా టులో ఉంటారన్నారు.

కూలిన కోర్టు ప్రహరీ : దెబ్బతిన్న ఇళ్లు


బాధితులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి పట్ట ణం లోని కోర్టు వద్ద గల కర్మక్రియల మండ పం పక్కన చెంబేడుకాలువ వద్ద ఆనుకుని ఉన్న 30 అడుగుల కోర్టు ప్రహరీ గోడ కూలింది. దీంతో రెండు ఇళ్లు ధ్వంసమయ్యాయి. విషయాన్ని బాధితులు ఎమ్మెల్యే సుధీర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన సంబం దిత అధికారులను అప్రమత్తం చేశారు. అదే విధంగా దెబ్బతిన్న ఇళ్లకు ప్రభుత్వం తరఫున పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్వాసితులను సమీపంలోని సచివాల యంలో చేర్చి మౌలిక వసతులు కల్పించాల న్నారు. ఈ క్రమంలో సమాచారం అందు కున్న టీడీపీ నాయకులు బాధితులతో మా ట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ కార్యదర్శి కాసరం రమేష్, బాలు, డిల్లీబాబు, మహేష్, రాకేష్, ఎంపీ శీను, నవీన్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ రాఘవులు నాయుడి కన్నుమూత

● సీఎం చంద్రబాబుకు జూనియర్



తిరుపతి (విశ్వవిద్యాల యాలు), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ నివర్సిటీ ఎకనమిక్స్ వి భాగ రిటైర్డు ప్రొఫెసర్ బొల్లినేని రాఘవులు నాయుడు(78) మంగళవారం కన్నుమూశా రు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడు తున్న ప్రొఫెసర్ రాఘవులు నాయుడు తిరు పతి విద్యానగర్‌లోని సత్యసాయి కాలనీలో స్వగృహంలో మంగళవారం తుదిశ్వాస విడి చారు. పూతలపట్టు మండలం గాండ్లపల్లెకు చెందిన రాఘవులు నాయుడు నాలుగు దశా బ్దాల పాటు ఎకనమిక్స్ బోధన, పరిశోధన రంగాల్లో కృషి చేశారు. సీఎం చంద్రబాబుకు ఏడాది జూనియర్ కూడా. రాఘవులు నాయు డికి ముగ్గురు సంతానం. గురువారం ఉద యం స్వగృహంలో భౌతికకాయాన్ని సందర్శ నార్థం ఉంచనున్నారు. అనంతరం స్వగ్రా మంలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

మా పొలంలో మొక్కలు పీకేశారు!

కేవీబీపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తమ పొలంలో తైలం మొక్కలను పీకేశారని శ్రీనివాపురానికి చెందిన వెంకటేశులు పోలీ సులకు ఫిర్యాదు చేశాడు. వెంకటేశులుకు చెందిన పొలంలో దొరవేలుకు బాట ఇచ్చాడు. అయితే ఆ బాట తనకు సరిపోదని తైలం మొక్కలను దొరవేలు పీకేశాడు. దీనిపై వెంకటేశులు ఫిర్యాదు చేశాడు.

ఎమ్మెల్యే అన్నదానం


వంటలను పరిశీలిస్తున్న ఆదిమూలం

సత్యవేడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళిని పురస్కరించుకుని మండలంలోని మదనంబేడులో ఉన్న అనాథ ఆశ్రమంలో సోమవారం ఎమ్మెల్యే ఆదిమూలం ఆధ్వర్యంలో పిల్లలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దీపావళి పర్వదినాన్ని అనాథ పిల్లల మధ్య జరుపుకోవడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని తెలిపారు. ఇళంగోవన్‌రెడ్డి, రవిరెడ్డి, వాసురెడ్డి, దొరవేల్ రెడ్డి, భక్తరెడ్డి, మునిశేఖర్ రెడ్డి, డిల్లీబాబు పాల్గొన్నారు.

వర్ష బాధితులను ఆదుకుంటాం


మావేశంలో మాట్లాడుతున్న నాగరాజు నాయుడు

ఏర్పేడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులపాటు భారీ వర్షాలు రానున్న నేపథ్యంలో ప్రతి గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి స్థానికులకు ఏ ఇబ్బంది కలిగినా ఎప్పటికప్పుడు సమాచారం తమకు అం దించాలని టీడీపీ మండల అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు కోరారు. ఏర్పేడు టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ... చెరువు కట్టలు తెగినా, ఇళ్లు కూలినా, ఎలాంటి అసౌకర్యం కలిగినా వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తిరుపతి పార్లమెంటు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ఆమందూరు సర్పంచ్ బాలగురునాథం యాదవ్, మనోహర్‌నాయుడు, నరేంద్ర, సుబ్రహ్మణ్యంరెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని రాజీవ్‌నగర్ కాలనీలో సోమవారం కురిసిన వర్షానికి తోడు పిడు గులు పడటంతో ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతినింది. దీంతో ఆ ప్రాంతంలో అంధకారం నెలకొంది. టీడీపీ పట్టణ మైనార్టీ అధ్యక్షుడు షేక్‌కరీం, నాయకులు మీర్జా, ఆరీఫ్ వెంటనే ఈ విషయాన్ని ఎమ్మెల్యే సుధీర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడారు. అధికారులు దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ప్రజలు ఎమ్మెల్యేకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్‌ఆర్‌ఐ సహకారంతో గ్రామీణ రోడ్డుకు మరమ్మతులు



ఏర్పేడు, అక్టోబరు 21(ఆంధ్ర జ్యోతి): మండలంలోని పెనగడం, చెన్నంపల్లి, కొత్తకాలువ గ్రామాలకు వెళ్లే మట్టి రోడ్డు గత రోజులుగా కురుస్తున్న వర్షాలకు అధ్వానంగా మారింది. ఈ రోడ్డులో మూడు గ్రా మాల ప్రజలు రాకపోకలు సాగించ లేని పరిస్థితి తలెత్తింది. పలు పా ఠశాలల బస్సులు ఈ దారిలో కూ రుకుపోతున్నాయి. సమస్యను గు ర్తించిన కొత్తకాలువకు చెందిన ఎన్‌ఆర్‌ఐ రమేష్ ఈ మూడు గ్రా మాలకు వెళ్లే రోడ్డుపై క్రషర్ డస్ట్‌ను తోలించారు. దీంతో మూడు గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు.

తెలంగాణ సీఎం నివాసంలో దీపావళి వేడుకల్లో ఎమ్మెల్యే సుధీర్



శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో జరిగిన దీపావళి వేడుకల్లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్, ఆయన సతీమణి పాల్గొన్నారు. వారితో కలిసి పండుగ సంబరాలు చేసుకున్నారు. మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి కుటుంబంతో రేవంత్‌రెడ్డి కుటుంబానికి విడదీయరాని అనుబంధం ఉన్న విషయం తెలిసిందే.

25న ఉద్యోగ మేళా

శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విక్రమ్ డిగ్రీ కళాశాలలో ఈనెల 25న శనివారం ఉద్యోగ మేళా నిర్వహించను న్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జరిగే మేళా ఉదయం 8.30గంటలకు ప్రారంభమ వుతుంది. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, బీటెక్, పీజీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు. వివరాలకు నెం.7989509540, 8919889609లలో సంప్రదించవచ్చు.

ముక్కంటి ఆలయంలో పాము కలకలం

శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం పాము కలకలం రేపింది. ఆలయంలోని అమ్మవారి సన్నిధి వద్ద ఉన్న రాతి కట్టడం సమీపంలో మంగళవారం పాము భక్తుల మధ్యకు చొరబడింది. దీంతో కాసేపు భక్తులు భయాందోళన చెందారు. ఆలయ అధికారులు అటవీశాఖసిబ్బంది సాయంతో పామును పట్టుకుని కైలాసగిరి అటవీప్రాంతంలో విడిచిపెట్టడంతో పరిస్థితి సద్దుమణిగింది.

పంది కాలువలో కొట్టుకుపోయిన గొర్రెలు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు ఆలత్తూరు సమీపంలో పంది కాలువ ఉధ్రు తంగా ప్రవహిస్తోంది. ఈక్రమంలో కత్తివారి కండ్రిగ గ్రామానికి చెందిన పాడిరైతు సుబ్ర మణ్యంకు చెందిన గొర్రెల మంద కాలువ దాటుతూ 15 జీవాలు కొట్టుకుపోయాయి. దీంతో తహసీల్దార్ శ్రీదేవి, పోలీసులు పంది కాలువ దగ్గరకు చేరుకుని రోడ్డుకు ఇరువై పుల కంప వేసి రాకపోకలను నిషేధించారు. కాగా వరి చేలలో నీరు చేరాయి.

ఘనంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడి జన్మదినం



శ్రీకాళహస్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణ టీడీపీ అధ్యక్షుడు విజయకుమార్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగింది. పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరు పుకోవాలని ఆకాంక్షించారు. షఫీ, సుధాకర్, రామకృష్ణ, ఆర్ముగం, షకీర్ అలీ, హిమత్‌కుమార్ తదితరులున్నారు.

దుస్తుల పంపిణీ

నారాయణవనం, అక్టోబర్ 21(ఆంధ్ర జ్యోతి): మండలంలోని అరణ్యంకండ్రిగ పం చాయతీ పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ మురళి దుస్తులను అందజేశారు. మంగళ వారం పంచాయితీ కార్యాలయంలో లక్ష్మీపూజ అనంతరం దుస్తులను, స్వీట్లను అందజేశారు.